క్లుప్తంగా

లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనాలి



అడ్డాకుల: రైతులు నాణ్యమైన విత్తనాలను లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని శాస్త్రవేత్తలు డా.సైదయ్య, డా.దివ్య వాణి సూచించారు. సోమవారం మూసాపేట మండలంలోని జానంపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు– అన్నదాతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధిక దిగుబడులను ఇచ్చే వంగడాలు, యూరియా వాడకం తగ్గించడం, మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకంతో రైతులు పంట దిగుబడి తగ్గుతుందని వివరించారు. పంటల మార్పిడి, చెట్ల పెంపకం పర్యావరణ పరిరక్షణ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో అనిల్ కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా.సింధూజ, ఏఈవోలు సురేశ్, శివ, కవిత, అనిత, రైతులు పాల్గొన్నారు.

నక్సల్స్ జనజీవన స్రవంతిలో కలవాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నక్సల్స్ జనజీవన స్రవంతిలో కలవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు తెలంగాణ చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలవాలని కోరుతూ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంతో ఉధృతంగా సాగిన తెలంగాణ ఉద్యమం సైతం ప్రజాస్వామ్యబద్ధంగా శాంతియుతంగా జరిగిందని, కొంతమంది మేధావుల రూపంలో చలామణి అవుతూ.. యూనివర్సిటీల్లో చదువుకోవడానికి వచ్చిన అమాయక విద్యార్థులను అసరాగా చేసుకుని నక్సలిజం వైపు మళ్లిస్తున్నారని, అడవుల్లోకి వెళ్లిన యువత ఎంతోమంది కాల్పుల్లో ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితి ఉందని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన గ్రీన్ హంట్‌కు ప్రస్తుత కగార్ కొనసాగింపని దీనిని అర్థం చేసుకుని నక్సలైట్లు జనజీవన స్రవంతిలోకి రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివసాగర్, శివప్రసాద్, టిల్లు, మస్తాన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన ఉండాలి



జడ్చర్ల: అవయవదానంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ కోఆర్డినేటర్ శివకుమార్ పిలుపునిచ్చారు. జడ్చర్లకు చెందిన కొత్ర వెంకటేశ్వర్లు(73) సోమవారం మృతిచెందడంతో ఆయన రెండు కళ్లను తమ సంస్థకు కుటుంబ సభ్యులు దానం చేశారని తెలిపారు. ఈ మేరకు కుటుంబ సభ్యులకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ప్రజలు అవయవదానం చేయడంతో ఆయా లోపాలున్నవారికి అవి ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు రామకృష్ణ, రామ్మోహన్ పాల్గొన్నారు.

కగార్‌ను నిలిపివేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కేంద్రం చేపడుతున్న కగార్‌ను వెంటనే నిలిపి ప్రజలకు జీవించే హక్కును కాపాడాలని టీపీఎఫ్ జిల్లా సమన్వయకర్త బిచ్చారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిత్యం ఎన్‌కౌంటర్లతో జరుగుతున్న మారణకాండను సృష్టిస్తున్న కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ఆత్మీయ సమ్మేళనం

నవాబుపేట: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నతపాఠశాలలో 2011–12 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 15ఏళ్లకు ఒకచోట కలిసి పాత జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. రోజంతా పాఠశాలలో గడిపారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన గురువులను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఆనంద్, లక్ష్మణ్, రమేశ్, రాజు, ప్రవీణ్, ప్రకాశ్, సత్యం, శ్రీనివాస్ ఉన్నారు.



'డిజిటల్'తో భూసమస్యలు దూరం

- అదనపు కలెక్టర్ రామ్మోహన్‌రావు
- భూ భారతి సర్వే పరిశీలన



సాలార్‌నగర్‌లో భూభారతి సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రామ్మోహన్‌రావు

గండేడ్: గ్రామాల్లో డిజిటల్ సర్వేతో రైతుల సమస్యలు దూరమవుతాయని అదనపు కలెక్టర్ రామ్మోహన్‌రావు తెలిపారు. సోమవారం మండలంలోని సాలార్‌నగర్‌లో భూభారతి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల భూములు వారికున్న సర్వేనంబర్లలో లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అందుకు డిజిటల్ సర్వే ద్వారా సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

మహమ్మదాబాద్: మండలంలోని మంగంపేట్ లో సోమవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సు కు అదనపు కలెక్టర్ రామ్మోహన్‌రావు హాజరయ్యా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధరణి ద్వారా ఎన్నో సమస్యలు తలెత్తాయని, అధికారులు వాటిని తమ చెంతకే వచ్చి పరిష్కరించేందుకు తగి న చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అందుకు తమ భూసమస్యలపై అధికారులకు దరఖాస్తు చే సుకోవాలని, రైతుల సమస్యలను కూడా అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్ రావు, ఆర్ఐ హైమద్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కేఎం నారాయణ, దశరత్‌గౌడ్, నర్సింహారెడ్డి, మండల అధికారులు పాల్గొన్నారు.

భూభారతితో సమస్యలకు పరిష్కారం

నవాబుపేట: భూభారతి చట్టంతో రైతుల ఏండ్ల తరబడి పడ్డ ఇబ్బందులు తీరుతాయని తహసీల్దార్ శ్రీనివాస్‌లు అన్నారు. సోమవారం మండలంలోని లింగంపల్లి, కాకర్‌జాల్‌లో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. రైతులకు సంబంధించి భూసమస్యలు తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ మూడు లాగిన్లలో నమోదుచేసి వారి సమస్యలు పరిష్కారిస్తామని తెలిపారు. మండలంలో సోమవారం నిర్వహించిన భూభారతి కార్యక్రమంలో గ్రామాలవారీగా 16 వినతులు వచ్చినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. లింగంపల్లిలో 11, కాకర్‌జాల్‌లో 5 వినతులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డీటీ సువర్ణ, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, విఠల్‌రెడ్డి, శ్యాంమ్, పద్మారెడ్డి, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే సదస్సులు

భూత్పూర్: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ కిషన్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొత్తూర్, రావులపల్లిలో భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో 36దరఖాస్తులు రాగా.. కొత్తూర్‌లో 25, రావులపల్లిలో 11 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశ్, సీనియర్ అసిస్టెంట్ రవి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

రాజాపూర్: మండలంలోని రాయపల్లిలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ రాధాకృష్ణ పాల్గొన్నారు. భూముల సమస్యలుంటే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ భారతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి వాకిటి శ్రీహరికి సన్మానం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/స్టేషన్ మహబూబ్‌నగర్ : రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని సోమవారం హైదరాబాద్‌లో జిల్లాకు చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్‌ముదిరాజ్, రాష్ట్ర ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

మిడ్జిల్: ముదిరాజ్ కులానికి చెందిన వాకిటి శ్రీహరికి మంత్రివర్గంలో చోటు కల్పించడంతో సోమవారం మండల కేంద్రంలో ఆ సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, నాయకులు గౌస్, మల్లికార్జున్‌రెడ్డి, వెంకటయ్య, శంకరయ్య, వెంకట్, జంగయ్య, ఉస్మాన్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

వివేక్‌కు మంత్రి పదవిపై హర్షం

నవాబ్‌పేట: ఎమ్మెల్యే గడ్డం వివేక్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో మండలంలో మాలమహానాడు నాయకులు సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా సోమవారం మండలంలోని కారుకొండలో అంబేద్కర్ విగ్రహానికి మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు రమేశ్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శేఖర్, చంద్రయ్య, శ్రీనివాస్, చెన్నయ్య, వెంకటయ్య, రాజశేఖర్, నిరంజన్, ప్రవీణ్, శ్రీకాంత్, గౌతమ్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



మహబూబ్‌నగర్ (వ్యవసాయం): రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడి భూసారాన్ని పెంచుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసులు తెలిపారు. సోమవారం దివిటిపల్లి రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ప్రైవేట్ విత్తనాలను కాకుండా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రూపొందించిన రకాలను వాడుకొని అధిక దిగుబడులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు భరత్ భూషణ్, కల్యాణి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ రాంప్రసాద్, ఏఈఓలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరిస్తాం

దేవరకద్ర: ప్రజావాణిలో వచ్చే ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తామని ఎంపీడీవో శ్రీనివాస్‌రావు తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఫిర్యాదులను పరిశీలించి ఆయా శాఖల అధికారులకు పంపించి పరిష్కారమయ్యేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఎంఈవో, ఏఓ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ అభివృద్ధి ఫలాలు

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- వివిధ పనులకు శంకుస్థాపన



గోల్ మజీద్ వద్ద బాక్స్ డ్రెయినేజీకి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రతి గడపకూ అభివృద్ధి ఫలాలు అందిస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. జిల్లాకేంద్రంలోని వెంకటేశ్వరకాలనీ, అప్పన్నపల్లిలోని శ్రీనగర్‌కాలనీలో రూ.2.08 కోట్లతో నిర్మించిన రెండు సీసీరోడ్లు, కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్డులో హాకా ఫర్టిలైజర్ షాపును సోమవారం ప్రారంభించారు. అలాగే పాతతోటలో రూ.2కోట్లతో నిర్మించనున్న వెజ్, నాన్‌వెజ్ మార్కెట్, గోల్ మసీదు ప్రాంతంలో టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.4కోట్లతో చేపట్టే బాక్స్ డ్రెయినేజీకి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నివర్గాల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌గా మారినందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎక్కువ నిధులు తీసుకొచ్చి అన్నివిధాలా అభివృద్ధి చేస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఫయాజ్, కాంగ్రెస్ నాయకులు బెనహర్, లక్ష్మణ్‌నాయక్, శివశంకర్, చిన్నా, ఖాజాపాషా, ఉమర్, మునీర్, మొయిన్, అంజద్, రవి, శివ, రాము, శేఖర్, రాణి, రఘు, మాజీ కౌన్సిలర్ రామాంజనేయులు, ఇన్‌చార్జ్ ఎంఈ సందీప్ వరల్డ్, డీఈఈ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

దేశ ఔన్నత్యానికి ప్రతీకలు

మన సంస్కృతి, సంప్రదాయాలు దేశ ఔన్నత్యానికి ప్రతీకలని, ప్రపంచంలోనే ఎనలేని గౌరవాన్ని ఇస్తున్నాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దీప్తి శాస్త్రీయ నృత్య కళాశాల ఆధ్వర్యంలో నెలపాటు చిన్నారులు, విద్యార్థినులకు కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇచ్చారు. సోమవారం రాత్రి శిబిరం ముగింపు ఉత్సవాలను బాదం రామస్వామి సరోజినీదేవి ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. అంతకుముందు చిన్నారుల కూచిపూడి నృత్యం ఆహూతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు లయన్ నటరాజ్, వీహెచ్‌పీ నాయకుడు యాదిరెడ్డి, కళాకారుడు భాగన్నగౌడ్, నిర్వాహకులు వెంకటేశ్, డాక్టర్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న విద్యార్థినుల కూచిపూడి నృత్యం

గురుకులాలకు ప్రపంచ గుర్తింపు తెచ్చిన వ్యక్తి..

జడ్చర్ల టౌన్: రాష్ట్రంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలకు ప్రపంచ గుర్తింపు తెచ్చిన వ్యక్తి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అని స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు లీడర్ శ్రీను పేర్కొన్నారు. సోమవారం జడ్చర్లలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న గురుకులాల్లో రూ.100కోట్ల అవినీతికి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్పడ్డారని కాంగ్రెస్ నాయకుడు శామ రామ్మోహన్‌రెడ్డి వాక్యానించడాన్ని ఖండించారు. ఆర్ఎస్‌పీ బాధ్యతలు చేపట్టాకే గురుకులాల్లో మెరుగైన విద్యతోపాటు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చిందన్నారు. అవినీతి జరిగిందనే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరగాలని, అప్పుడే అసలు వాస్తవాలు వెలుగు చూస్తాయన్నారు. గురుకులాల కార్యదర్శిగా కోడింగ్, మహిళల సైనిక్ కళాశాలల ఏర్పాటు చేసి ఎంతో మంది పేద విద్యార్థులను ఉన్నత ఉద్యోగాల్లో చేరేలా చేశారన్నారు. అలాగే డాక్టర్లు, ఇంజినీర్లు, క్రీడా, సినీరంగాల్లో రాణిస్తున్నారని గుర్తుచేశారు. అలాంటి ఆర్ఎస్‌పీ పై అనుచిత వాఖ్యలు చేయడం తగదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలను నీరుగార్చేయత్నం చేస్తుందని, ఒకేషనల్, ఐటీఐ కోర్సులను తొలగించే కుట్రకు పాల్పడుతుందని ఆరోపించారు. ఇంటిగ్రేటెడ్ హాస్టళ్ల పేరుతో గురుకులాలను కనుమరుగు చేసే యత్నం జరుగుతుందని, దానిని తాము అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్వేరోలు బంగారయ్య, దేవేందర్ నాయక్, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనివర్సిన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, తాహేర్ పేర్కొన్నారు. సోమవారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న జెడ్పీ జీపీఎఫ్ మెడికల్, సరెండర్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా వేసవి సెలవుల్లో ట్రెనింగ్, బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులకు ఈఎల్స్‌ను మంజూరు చేయాలన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసిన ఓపీఎస్ విధానాన్ని తీసుకురావాలని కోరారు. 317 జీఓ బాధిత ఉపాధ్యాయులను సమీక్షించి న్యాయం చేయాలన్నారు. బదిలీలు, పదోన్నతులు, హెల్త్‌కార్డులు, పీఆర్సీ, అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు శశిధర్, నర్సింహులుగౌడ్, శరణప్ప, మల్లికార్జున్, రాఘవేందర్, శ్రీనివాసులుగౌడ్, ఆంజనేయులు, మురళి పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్షేత్రస్థాయి పరిశీలన



భాగ్యనగర్ కాలనీలో నక్షాల సహాయంతో హద్దులను పరిశీలిస్తున్న ఏసీపీ జోత్స్నాదేవి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: డివిజన్ల వారీగా ముసాయిదాలో పొందుపరిచిన హద్దులను ఏసీపీ జోత్స్నాదేవి ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా నక్షాలతో సరిచూసే ప్రక్రియ నగరంలో మూడు రోజులుగా కొనసాగుతోంది. ప్రతిపాదించిన మొత్తం 60 డివిజన్లకు సోమవారం వరకు 33వ డివిజన్ పూర్తయింది. మిగతావి ఈనెల 11వ తేదీలోగా పూర్తి చేయనున్నారు. ప్రతిరోజూ కనీసం తొమ్మిది డివిజన్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల పరిశీలన

- జడ్చర్ల మున్సిపాలిటీలో పర్యటించిన ట్రాన్స్‌కో అధికారులు
- విద్యుత్ సమస్యల పరిష్కార చర్యలకు డీఈ ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్..



సరస్వతీనగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న డీఈ, ఏఈలు

జడ్చర్ల టౌన్: టెర్రర్ ట్రాన్స్‌ఫార్మర్స్ శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి జడ్చర్ల విద్యుత్ అధికారులు స్పందించారు. మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో డీఈ చంద్రమౌళి, ఏఈలు ఎర్రన్న, వెంకటయ్య పర్యటించారు. 3వ వార్డులో గతవారం పదేళ్లబాలుడు మృతికి కారణమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను పైకి లేపడంతోపాటు చుట్టూ ఫెన్సింగ్ వేయించాలని ఏఈలను ఆదేశించారు. రాజీవ్‌నగర్‌లో ఇళ్లపై ఉన్న వైర్లను తొలగించాలని సూచించారు. సెయింట్‌పాల్ స్కూల్ రోడ్డులోని ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 18, 19, 6, 4 వార్డుల్లోనూ పర్యటించారు. మరికొన్ని ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి వెంటనే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్నింటికి ఫెన్సింగ్ వేయించాలని ఆదేశించారు. వారివెంట వార్డు కౌన్సిలర్ సతీశ్, లైన్‌మెన్‌లు మధు, భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



జడ్చర్ల పట్టణంలో బడిబాట నిర్వహిస్తున్న ఎంఈవో ఎంఈవో, చైర్‌పర్సన్



రాయపల్లిలో బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

జడ్చర్ల టౌన్: ప్రభుత్వ పాఠశాలలో మీ పిల్లలను చేర్పించండి.. మెరుగైన విద్యనందిస్తామని జడ్చర్ల పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం, ఎంఈవో మంజులాదేవి పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సోమవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగారు. ఎంఈవో ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. పాఠశాల ప్రగతికి సంబంధించిన కరపత్రాలను ఇంటింటికీ అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత పాల్గొని ప్రభుత్వ పాఠశాలల గురించి ప్రచారం చేశారు. ప్రచారంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాగసాలలోనూ ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి బడిబయటి పిల్లలను తమ పాఠశాలకు పంపించాలని కోరారు. మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు.

ప్రైవేట్ బడి వద్దు.. ప్రభుత్వ బడే ముద్దు

రాజాపూర్: గ్రామాల్లో బడిఈడు పిల్లలందరినీ ప్రైవేట్ బడికి పంపకుండా.. ప్రభుత్వ పడికి పంపించాలని రాయపల్లి హెచ్‌ఎం రంజిత్, గోనాయో వ్యవస్థాపకుడు ప్రశాంత్‌చారి పేర్కొన్నారు. మండలంలోని రాయపల్లిలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఇంటింటికీ తిరిగి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతో శిక్షణతో కూడిన ఉపాధ్యాయులు ఉంటారని.. నేడు ప్రభుత్వాలు విద్యకు పెద్దపీటవేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు పంపి అప్పులపాలు కావొద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

త్రిసభ్య కమిటీ విచారణ పూర్తిచేయాలి

జడ్చర్ల టౌన్: మండలంలోని పోలేపల్లి జీపీలో జరిగిన అక్రమాలపై విచారణకు వేసిన త్రిసభ్య కమిటీ నాలుగు నెలలుగా విచారణ పూర్తిచేయకుండా ఉన్నదని, వెంటనే విచారణ పూర్తిచేసేలా చూడాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు యాదయ్య ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జీపీ నిధులు రూ.కోటి73లక్షలు దుర్వినియోగమైనట్లు డీఎల్‌పీవో 8నెలల క్రితం నివేదిక ఇచ్చినప్పటికీ ఇప్పటికీ ఏమీ తేలకుండా తాత్సారం చేస్తున్నారని, వెంటనే విచారణ పూర్తిచేసి నిధులు రికవరీ చేయాలని కోరారు.

మాజీ సర్పంచ్‌పై కేసు నమోదు

రాజాపూర్: పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారంటూ సోమవారం చొక్కంపేట్ మాజీ సర్పంచ్ కృష్ణయ్యపై పంచాయతీ కార్యదర్శి జైపాల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై శివానందం గౌడ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. చొక్కంపేట్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సర్వే చేస్తుండగా గ్రామానికి చెందిన మంచాల రమేశ్, మంచాల చెన్నయ్య, మంచాల యాదమ్మ ఇక్కడ ఎలాంటి ప్లాట్లు లేవని చెప్పారు. దీంతో పంచాయతీ కార్యదర్శి జైపాల్ ఇవి ఎవరిచ్చారిచ్చారని అడిగాడు. దీంతో ఆ ముగ్గురు పాత పంచాయతీ కార్యదర్శి ఇచ్చారని చెప్పారు. అప్పటి కార్యదర్శి నరేందర్‌ను ఫోన్‌లో సంప్రదించగా.. ఆ సంతకం నాది కాదు.. ఎవరో ఫోర్జరీ చేసి మోసం చేశారని నరేందర్ చెప్పాడు. దీంతో అప్పటి మాజీ సర్పంచ్ సంతకాలు ఫోర్జరీ చేసి ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారంటూ సోమవారం రాజాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కృష్ణయ్యపై ఫిర్యాదు చేయగా.. కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జాన్‌వెస్లీ అరెస్టు అప్రజాస్వామికం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: గద్వాల జిల్లా రాజోళి మండలం పెద్దధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ జరిగిన ఆందోళనలో అరెస్ట్ అయి జైలులో ఉంచినవారి కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీరామ్‌నాయక్, గద్వాల జిల్లా కార్యదర్శి వెంకటస్వామిని పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు ఒక ప్రకటనలో తెలిపారు. పరామర్శకు వెళ్తున్న నాయకులను పోలీసులు వెంబడించి అరెస్టు చేయడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో అనుమతిచ్చిన ఈ ఫ్యాక్టరీ ఏర్పాటును కాంగ్రెస్ అప్పట్లో వ్యతిరేకించి ప్రస్తుతం అధికారంలో వచ్చాక ఫ్యాక్టరీ కొనసాగించడానికి ప్రయత్నించడం దుర్మార్గమని విమర్శించారు. కాంగ్రెస్ చెప్పే మాటలకు చేసే పనులకు పొంతనే లేదని పేర్కొన్నారు.

అధ్యాపకుడి మృతికి వీసీ సంతాపం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఎంఈడీ విభాగంలో గతకొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న అధ్యాపకుడు వినోద్ అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలిసిన పీయూ వీసీ శ్రీనివాస్ బండమీదిపల్లిలోని వినోద్ ఇంటికెళ్లి పార్థివదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వినోద్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పి, అంత్యక్రియలకు కొంతనగదును అందజేశారు. వినోద్ చనిపోవడం బాధాకరమని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లీకొడుకు అదృశ్యం

జడ్చర్ల: మండలంలో లక్ష్మణ్ నాయక్‌తండాకు చెందిన కల్యాణి(22), కుమారుడు సాయి చరణ్(1)లు ఆదివారం నుంచి కనిపించకుండా పోయారని సీఐ కమలాకర్ తెలిపారు. భర్త ముడావత్ కిషన్ బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఉన్న భార్య, ఏడాది కుమారుడు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తెలిపాడు. సోమవారం కల్యాణి తండ్రి మేఘావత్ ముత్యాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భూత్పూర్ ఎంఈవోపై ఫిర్యాదు

భూత్పూర్: మండల విద్యాశాఖాధికారి ఉషారాణిపై సోమవారం తెలంగాణ సామాజిక విద్యార్థి సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి మానాజీపేట రమేశ్‌గౌడ్ డీఈవో నవీన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలోని ప్రైవేట్ విద్యాసంస్థల పేర్లముందు టెక్నో, టాలెంట్, గ్రామర్ అనే బోర్డులు పెట్టి ప్రజలను మోసం చేస్తున్నా ఎంఈవో పట్టించుకోవడంలేదని రమేశ్‌గౌడ్ డీఈవోకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం ఫ్లెక్సీల్లో కూడా ఐఐటీ, నీట్, సీబీఎస్సీ పేర్కొంటూ ప్రచారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది ఫీజులు దండుకుంటున్నారని వివరించారు. ఎంఈవో అండ చూసుకొని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం ఇష్టారాజ్యంగా బోర్డులు పెట్టుకుంటున్నారని, ఎంఈవోను వెంటనే సస్పెండ్ చేయాలని పేర్కొన్నారు.

